సాక్షి
పార్వతీపురం మన్యం
ఆదివారం । 19 । మే । 2024



ఆయుష్షు పెరుగుతోంది..
మానవుని జీవన శైలిలో మార్పులు చోటుచేసుకోవడం వల్ల వయసుతో సంబంధం లేకుండా అనేక మంది గుండె జబ్బుల బారిన పడుతున్నారు. - 8లో



24వ తేదీ నుంచిపదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు - 8లో
పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24వ తేదీ నుంచి జూన్ 3 వరకు నిర్వహిస్తామని డీఆర్వో జి. కేశవనాయుడు అన్నారు.



స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత - 8లో
ఈవీఎంలను భద్రపరిచిన లెండి, జేఎన్‌టీయూ కళాశాలల వద్ద భద్రతా ఏర్పాట్లను ఎస్పీ ఎం.దీపిక శనివారం పరిశీలించారు.

న్యూస్‌రీల్

సంతోషపురం పరిసరాల్లో ఏనుగులు



సంతోషపురంలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

గరుగుబిల్లి: మండలంలోని సంతోషపురం పంచాయతీ పరిసరాల్లో ఏనుగుల గుంపు శనివారం దర్శనమిచ్చింది. గత ఐదున్నరేళ్లుగా కురుపాం నియోజకవర్గంలోని గరుగుబిల్లి, కొమరాడ, జియ్యమ్మవలస, కురుపాం మండలాల్లో ఏనుగులు సంచరిస్తున్నాయి. గిజబ, నందివానివలస, తోటపల్లి గ్రామాల మీదుగా సంతోషపురం చేరుకొన్నాయి. పంటల నాశనం చేసే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగుల గుంపును ఈ ప్రాంతం నుంచి తరలించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

పిడుగుల వర్షం



పార్వతీపురంలో కురుస్తున్న వర్షం

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలోని పలు చోట్ల శనివారం పిడుగులతో కూడిన వర్షం కురిసింది. భారీ వర్షానికి పట్టణంలోని బెలగాం, వైకేఎం నగర్, సౌందర్యనగర్ కాలనీ, పాతబస్టాండ్ ప్రాంతాల్లో నీరు చేరింది. కురుపాం, కొమరాడ, జియ్యమ్మవలస మండలాల్లో చిరుజల్లులు కురిశాయి. వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఉదయమంతా ఎండలతో ఇబ్బంది పడిన ప్రజలకు ఉపశమనం కలిగింది. వర్షాలు ఖరీఫ్ అనుకూలమని రైతులు చెబుతున్నారు.

ఆర్‌బీకేలకు వరి విత్తనాలు



కందిశ ఆర్‌బీకేకు చేరుకున్న వరి విత్తనాలు

రేగిడి: జిల్లాలో అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. వరి వెదలు, నారు మడులను సిద్ధం చేస్తున్నారు. రైతులకు కావాల్సిన వరి విత్తనాలను సమకూర్చే పనిలో వ్యవసాయ అధికారులు నిమగ్నమయ్యారు. ఊరూరా రైతులకు అండగా ఉన్న రైతు భరోసా కేంద్రాలకు విత్తనాలను చేర్చుతున్నారు. తొలుత ఎంటీయూ–1121, స్వర్ణమసూరి విత్తనాలను సరఫరా చేస్తున్నట్టు రేగిడి ఏఓ మురళీకృష్ణ తెలిపారు. పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని, కావాల్సిన రైతులకు 50 శాతం రాయితీపై విక్రయిస్తామని చెప్పారు.

తగ్గిన మామిడి ఎగుమతులు

- తగ్గిన దిగుబడి
- పెరిగిన ధర



ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసేందుకు మామిడి పండ్లను ప్యాక్ చేస్తున్న రైతులు

లక్కవరపుకోట: మామిడి పండ్లకు గిరాకీ ఉన్నా రైతుల్లో సంతోషం కనిపించడం లేదు. ఈ ఏడాది మామిడి పంటకు వాతావరణం అనుకూలించక పోవడం, దిగుబడులు తగ్గడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎగుమతి చేసేంత పంట లేక దిగాలు పడుతున్నారు. జిల్లాలో సుమారుగా 43,662 హెక్టార్లో మామిడి పంట సాగుచేస్తున్నట్టు ఉద్యానశాఖ అధికారుల రికార్డులు చెబుతున్నాయి. అత్యధికంగా గంట్యాడ మండలంలో 4,091 హెక్టార్లు, లక్కవరపుకోటలో 1109, కొత్తవలసలో 2,488, ఎస్.కోటలో 424, వేపాడలో 1018, జామి మండలంలో 2,114 హెక్టార్లలో మామిడి పంట సాగులో ఉంది. వాతావరణం అనుకూలిస్తే హెక్టారుకు సగటున 9 టన్నుల పైబడి దిగుబడి వస్తుంది. గతేడాది దిగుబడులు బాగుండడంతో జిల్లా నుంచి సుమారు 5,67,600 మెట్రిక్ టన్నుల మాడి పండ్లు, కాయలను ఢిల్లీ, ముంబయి, కోల్‌కతా తదితర ప్రాంతాలకు ఎగుమతి చేశారు. ఇక్కడ సాగు చేసే బంగినపల్లి, సువర్ణరేఖ, తోటపూరి, రసాలకు అంతరాష్ట్ర మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. అయితే, ఈ ఏడాది పంట దిగుబడులు తగ్గడంతో ఆశించిన మేర ఎగుమతులు లేవని రైతులు, వ్యాపారులు చెబుతున్నారు.

భద్రత 'స్ట్రాంగ్'



ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో చర్చిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

- పటిష్ట బందోబస్తు మధ్య ఈవీఎంలు
- ఓట్ల లెక్కింపునకు పక్కా చర్యలు

సాక్షి, పార్వతీపురం మన్యం: స్వల్ప ఘటనలు మినహా జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఈవీఎంల్లో నిక్షిప్తమైన అభ్యర్థుల భవితవ్య 'లెక్కలు' తేల్చేందుకు జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం ఉద్యాన కళాశాల వద్ద ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రాలకు జిల్లాలోని నాలుగు నియోజక వర్గాల నుంచి ఈవీఎంలు, ఇతర ఎన్నికల సామగ్రిని తరలించిన విషయం విదితమే. ఆ మరుసటి రోజు పార్లమెంటరీ నియోజకవర్గ సాధారణ పరిశీలకులు ప్రమోద్‌కుమార్ మెహర్ద, పార్లమెంటరీ నియోజకవర్గ పోలీసు పరిశీలకులు నయీం ముస్తఫా మన్సూరి, వివిధ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్, పోలీస్ సూపరింటెండెంట్ విక్రాంత్ పాటిల్, ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల పరిశీలనలో సీల్ వేశారు. పార్లమెంట్, శాసనసభ నియోజకవర్గాలకు వేర్వేరుగా స్ట్రాంగ్ రూంలకు మూడంచెల భద్రత, బందోబస్తు కల్పించారు. మొదటి స్థాయిలో స్థానిక పోలీసులు, రెండవ స్థాయిలో రాష్ట్ర సాయుధ బలగాలు, మూడవ స్థాయిలో కేంద్ర సాయుధ బలగాలతో పహారా ఏర్పాటు చేశారు. రేయింబవళ్లు పటిష్ట పహారా, సీసీ కెమెరాతో పర్యవేక్షిస్తున్నారు. అనుమతులు లేకుండా ఆ ప్రాంతానికి వెళ్లడానికి ఎవరికీ అవకాశం ఉండదు. జిల్లాతో పాటు అరకు పార్లమెంటరీ నియోజకవర్గ పరిధి అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు, రంపచోడవరం, పాడేరు నియోజకవర్గాల పోస్టల్ బ్యాలెట్‌లను కూడా పార్వతీపురం ఉద్యాన కళాశాలలోనే భద్రపరిచారు.

ఓట్ల లెక్కింపునకు పక్కా ఏర్పాట్లు

ఓట్ల లెక్కింపునకు అవసరమైన ఏర్పాట్లపై కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఉద్యాన కళాశాలలోని మూడంచెల భద్రత, ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలసి ఆయన శనివారం పరిశీలించారు. అధిక సంఖ్యలో లెక్కింపు కేంద్రం బయట జనాలు చేరుకునే అవకాశం ఉన్నందున భారీ వాహనాలను అనుమతించకుండా దారి మళ్లించేందుకు సూచనలు చేశారు. ప్రవేశ మార్గం దగ్గర గుర్తింపు కలిగిన సాధారణ ఏజెంట్లను మాత్రమే అనుమతించేలా చర్యలు తీసుకుంటున్నారు. దీనికోసం అవసరమైన పోలీస్ సిబ్బంది నియామకంతో పాటు, బారికేడ్లను ఏర్పాటు చేయనున్నారు. ఓట్ల లెక్కింపు ముందు రోజు కౌంటింగ్ కేంద్రం సమీపంలోని గ్రామ ప్రజలు బయట ప్రాంతవాసులకు ఆశ్రయం కల్పించకుండా చర్యలు తీసుకుంటున్నారు. కౌంటింగ్ రోజు ఉదయం మాత్రమే స్ట్రాంగ్ రూంలను తెరిచి ఈవీఎంలను ఆయా నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాల గదులకు వరుస క్రమంలో తరలిస్తారు. అప్పటి వరకు ఈవీఎంలు స్ట్రాంగ్ రూంలోనే ఉంటాయి. లెక్కింపు రోజున ఆయా పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లు, రిటర్నింగ్ అధికారి, పరిశీలకుని సమక్షంలో వీడియో చిత్రీకరణ మధ్య తెరుస్తారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలకూ అవకాశం ఇవ్వకుండా అంతవరకూ 144 సెక్షన్ అమలు చేస్తున్నారు.

సాలూరులో ఆధ్యాత్మిక శోభ



అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుపుతున్న భక్తులు

- స్వర్ణ వస్త్రాలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరి
- అమ్మవారిని దర్శించుకున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

సాలూరు: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీ కన్యకాపరమేశ్వరికి భక్తులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని నైవేద్యం, సారెలు సమర్పించారు. అమ్మవారిని బంగారు, వెండి చీరలతో అలంకరించారు. పల్లకిలో ఊరేగింపు చేశారు. కుంకుమ పూజలు జరిపారు. రోజంతా ఆధ్యాత్మిక చింతనతో గడిపారు. రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కన్యకాపరమేశ్వరి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



స్వర్ణ వస్త్రాలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు

కిర్గిస్తాన్‌లో అల్లర్లు...
ఆందోళనలో రాజాం వాసులు

రాజాం సిటీ: కిర్గిస్తాన్‌లో జరుగుతున్న అల్లర్లు రాజాం వాసులను కలవరపెడుతున్నాయి. రాజాం ప్రాంతానికి చెందిన 12 మంది విద్యార్థులు ఆ దేశంలో వైద్య విద్యను అభ్యసిస్తున్నారు. ప్రస్తుతం రష్యాలోని కిర్గిస్తాన్‌లో ఉన్న పరిస్థితుల నేపథ్యంలో తల్లిదండ్రులు ఒకింత ఆందోళనకు గురతున్నారు. పట్టణ పరిధి బాబానగర్, వాసవీనగర్, శ్రీకాకుళం రోడ్డు, అమ్మవారి కాలనీ, లక్ష్మీపురం, లింగాలవలస ప్రాంతాలకు చెందిన ఎస్.భార్గవ్‌నాయుడు, టి.వినయ్, సీహెచ్ సురేంద్ర, బి.గ్రీష్మ, జి.సోమేశ్వరరావు తదితర విద్యార్థులు అక్కడ చదువుతున్నారు. ఆయా విద్యార్థులతో తల్లిదండ్రులు ఫోన్‌లో మాట్లాడుతూ ఎప్పటికప్పుడు పరిస్థితిలను అడిగితెలుసుకుంటున్నారు. అక్కడ ఉన్న విద్యార్థులంతా క్షేమంగానే హాస్టల్‌లో ఉన్నామంటూ చెబుతున్నా.. తల్లిదండ్రుల్లో టెన్షన్ తగ్గడంలేదు. మరో నెల రోజుల్లో కోర్సులు పూర్తిచేసుకుని వచ్చే సమయంలో ఇలా జరగడం ఆందోళనకరంగా ఉందని పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వం స్పందించి పిల్లలకు రక్షణ కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

తెలంగాణా ఈఏపీ సెట్‌లో..
మెరిసిన మన్యం విద్యార్థులు

ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన విద్యార్థులు టీఎస్ ఈఏపీ సెట్‌లో ప్రతిభ చూపారు. ర్యాంకుల పంట పండించారు. ఇంజినీరింగ్ విభాగంలో పాలకొండ మండలం యరకరాయపురం గ్రామానికి చెందిన సతివాడ జ్యోతిరాదిత్య ప్రథమ ర్యాంకు, కొమరాడ మండలం దళాయిపేట గ్రామానికి చెందిన ధనుకొండ శ్రీనిధి పదో ర్యాంకు సాధించారు. అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో బలిజిపేట మండలం చిలకలపల్లి గ్రామానికి చెందిన నగుదాసరి రాధాకృష్ణ రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకును సొంతం చేసుకున్నాడు.

- కొమరాడ/పాలకొండ/బలిజిపేట

- ఇంజినీరింగ్ విభాగంలో 1, 10 ర్యాంకులు
- అగ్రికల్చర్ అండ్ ఫార్మసీలో రెండో ర్యాంకు సాధన
- విద్యార్థులపై అభినందనల జల్లు

దళాయిపేట ఆణిముత్యం



కుటుంబ సభ్యులతో ధనుకొండ శ్రీనిధి

తెలంగాణ ఈఏపీ సెట్‌లో రాష్ట్ర స్థాయిలో 10వ ర్యాంకు సాధించిన శ్రీనిధి స్వగ్రామం కొమరాడ మండలం దళాయిపేట. ఆమె తల్లిదండ్రులు శ్రీనివాసరావు, గేదెల సుశీల ఇద్దరూ ఉపాధ్యాయులే. ఉద్యోగ రీత్యా విజయనగరం పట్టణంలో నివసిస్తున్నారు. శ్రీనిధి సీబీఎస్ఈలో 490/500 మార్కుల సాధనతో పాటు జేఈఈ మెయిన్స్‌లో ఆల్‌ఇండియా ఓపెన్ కేటగిరీలో 261, ఓబీసీలో 35వ ర్యాంకు సాధించింది. జేఈఈ మెయిన్‌లో బీఆర్క్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో ఫస్ట్‌ర్యాంకు సొంతం చేసుకుంది. పెద్దకుమార్తె ధనుకొండ సాయి సుదీప్తి కూడా ట్రిపుల్ ఐటీలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. కుమార్తెలిద్దరూ చదువులో రాణిస్తుండడంతో తల్లిదండ్రులు సంతోషపడుతున్నారు. శ్రీనిధిపై గ్రామస్తులు అభినందనల జల్లు కురిపించారు.

చిలకలపల్లి కుర్రాడు సత్తా చూపాడు



రాధాకృష్ణను అభినందిస్తున్న కుటుంబ సభ్యులు

తెలంగాణా ఈఏపీ సెట్‌లో అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో బలిజిపేట మండలం చిలకలపల్లి గ్రామానికి చెందిన నగుదాసరి రాధాకృష్ణ సత్తా చూపాడు. రాష్ట్ర స్థాయిలో రెండవ ర్యాంకు సాధించాడు. 9, 10 తరగతులు విశాఖలోని ఓ ప్రైవేటు పాఠశాలలో, ఇంటర్మీడియట్ రాజమండ్రిలోని ప్రైవేటు కళాశాలలో చదివాడు. తెలంగాణా ఈఏపీ సెట్‌లో ప్రతిభ చూపి కుటుంబ సభ్యులు, గ్రామస్తుల అభినందనలు అందుకున్నాడు. తల్లిదండ్రులు కృష్ణవేణి, నారాయణరావులది వ్యవసాయ కుటుంబం. ముగ్గురు పిల్లల్లో చిన్నవాడైన రాధాకృష్ణ చదువులో ప్రతిభ చూపడంతో తల్లిదండ్రులు సంతోషపడుతున్నారు. తాత, విశ్రాంత హెచ్ఎం జగన్నాథం, అన్నదమ్ములు, మేనమామ ప్రోత్సాహం వల్లే ర్యాంకు సాధించగలిగినట్టు రాధాకృష్ణ తెలిపాడు. ఉన్నత స్థాయిలో నిలవాలన్నదే లక్ష్యమని పేర్కొన్నాడు.

పాలకొండ విద్యా'జ్యోతి'



జ్యోతిరాదిత్యను అభినందిస్తున్న తల్లి హైమావతి

విద్యల కొండ.. పాలకొండ అనే నానుడి మరోమారు రుజువయింది. పరీక్ష ఏదైనా ఈ ప్రాంత విద్యార్థులు ప్రతిభ చూపడం సాధారణం. శనివారం విడుదలైన తెలంగాణా ఈఏపీ సెట్‌లో పాలకొండ మండలం యరకరాయపురం గ్రామానికి చెందిన సతివాడ జ్యోతిరాదిత్య స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించి అబ్బురపరిచాడు. విద్యార్థి తండ్రి సతివాడ మోహనరావు సాంఘిక సంక్షేమశాఖలో సీనియర్ అసిస్టెంట్ (ఎచ్చెర్ల)గా పనిచేస్తుండగా, తల్లి హైమావతి ఆర్టీసీలో విధులు నిర్వర్తిస్తున్నారు. పిల్లల చదువుల కోసం వీరు శ్రీకాకుళంలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. వీరి కుమార్తె ఉషశ్రీ ఇప్పటికే ఎంబీబీఎస్ చదువుతుండగా, కుమారుడు ఆదిత్య విజయవాడలో ఇంటర్మీడియట్ చదివి 954 మార్కులు సాధించాడు. తెలంగాణా రాష్ట్రం నిర్వహించిన ఈఏపీ సెట్‌లో ఫస్ట్‌ర్యాంకు సాధించడంతో తల్లిదండ్రులు మురిసిపోతున్నారు. ప్రణాళికా బద్ధంగా చదవడం వల్లే మంచి ర్యాంకు వచ్చినట్టు జ్యోతిరాదిత్య తెలిపాడు. విద్యార్థికి యరకరాయపురం వాసులు, బంధువులు అభినందనలు తెలిపారు.

రాజశేఖర్ సేవలు శ్లాఘనీయం



దివంగత న్యాయమూర్తి బొట్ట రాజశేఖర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్

విశాఖ లీగల్: న్యాయవాదులు, న్యాయమూర్తులు సాంకేతికత వైపు అడుగులు వేయాలని గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ సూచించారు. నగరంలోని ఒక హోటల్లో శనివారం దివంగత హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ బట్ట రాజశేఖర్ చిత్రపటం వద్ద నివాళలర్పించారు. ఈ సందర్భంగా జస్టిస్ రాయ్ మాట్లాడుతూ దేశంలోనే మొట్టమొదటిగా ఆన్‌లైన్ ద్వారా ప్రథమ సమాచార నివేదికను స్వీకరించిన రాజశేఖర్ సంచలనం సృష్టించినట్లు చెప్పారు. కేవలం న్యాయమూర్తి మాత్రమే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా సాంకేతిక సలహాలకు కేంద్ర బిందువుగా రాజశేఖర్ నిలిచారన్నారు. నిజాయితీ, నీతి కలిగిన న్యాయమూర్తిగా విశేష ఖ్యాతి గడించినట్లు విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్.ఎస్.సోమయాజులు అన్నారు. రాజశేఖర్ సేవలను రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్ వివరిస్తూ అందరికీ ఆప్తుడుగా నిలిచిన మంచి వ్యక్తి అని పేర్కొన్నారు. జూనియర్లకు ఒక మార్గదర్శి రాజశేఖర్ నిలిచారని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి చీమలపాటి రవి కొనియాడారు. కార్యక్రమంలో విశాఖ న్యాయవాదుల సంఘం ప్రతినిధులు, రాజశేఖర్ కుటుంబ సభ్యులు, విశాఖ జిల్లా వినియోగదారుల మండలి–2 సభ్యురాలు బి.విజయదుర్గ, సీనియర్ న్యాయవాది హేమమాలిని, రాజశేఖర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మూల్యాంకనంపై అవగాహన

- 24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు
- జిల్లాలో హాజరుకానున్న 22,831 మంది ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు
- ఆర్ఐఓ ఎం.ఆదినారాయణ



మూల్యాంకన విధానంపై అవగాహన కల్పిస్తున్న ఆర్ఐఓ ఆదినారాయణ

రాజాం సిటీ: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ మూల్యాంకనం ఈ ఏడాది నుంచి ఇంటర్మీడియట్ బోర్డు ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్టు ఆర్ఐఓ ఎం.ఆదినారాయణ స్పష్టంచేశారు. స్థానిక చైతన్య పాఠశాలలో పట్టణంలోని ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాల్స్, సిబ్బందికి ఆన్‌లైన్ విధానంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ఆఫ్‌లైన్ విధానంలోనే మూల్యాంకనం జరిగిందని, ఆ సమయంలో రోజుకు 30 పేపర్లు మాత్రమే ఉండేవని, ఆన్‌లైన్ విధానంలో 60 పేపర్లు మూల్యాంకనం చేయాల్సి ఉంటుందన్నారు. దీనికోసం కంప్యూటర్ నాలెడ్జితో అధ్యాపకులు అందరూ సన్నద్ధం కావాలని సూచించారు. ఏటా అన్ని పరీక్షలకు సంబంధించి ఆన్‌లైన్ లోనే మూల్యాంకనం జరుగుతుందన్నారు. ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24 నుంచి జరగనున్నట్టు వెల్లడించారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు అరగంట ముందు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. జిల్లాలో ప్రథమ సంవత్సరం పరీక్షలను 42 కేంద్రాల్లో నిర్వహించనున్నామని, 14,904 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉందని పేర్కొన్నారు. ద్వితీయ సంత్సరం పరీక్షలకు సంబంధించి 21 కేంద్రాలను కేటాయించగా 7,927 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. ఇంటర్మీడియట్ ప్రవేశాలకు అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు. ఈ నెల 15 నుంచి జూన్ 1 వరకు మొదటి విడత, జూన్ 10 నుంచి జూలై 1 వరకు రెండో విడత అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల చేశామని పేర్కొన్నారు. జిల్లాలో హైస్కూల్ ప్లస్‌గా ఆరు పాఠశాలలు ఎంపికయ్యాయని తెలిపారు. వీటిలో జామి, బొండపల్లి, గరివిడి, రామభద్రాపురం, బొబ్బిలి, ఆర్.ఆమదాలవలస మండలాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు త్వరపడి ఆయా కళాశాలల్లో ప్రవేశాలు పొందాలని కోరారు.

సీబీఎస్ఈ సిలబస్ బోధనపై ముగిసిన శిక్షణ



మాట్లాడుతున్న ఆర్‌జేడీ విజయభాస్కరరావు, డీఈఓ ప్రేమకుమార్

విజయనగరం అర్బన్: జిల్లాలో సీబీఎస్ఈ సిలబస్ అమలు చేస్తున్న 63 పాఠశాలలకు చెందిన 200 మంది సబ్జెక్టు టీచర్లకు బోధనపై రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ శనివారంతో ముగిసింది. విజయనగరం మోడల్ స్కూల్‌లో సాగిన శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా ఆర్‌జేడీ బి.విజయభాస్కరరావు హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను బోధనలో అమలు చేయాలని సూచించారు. విద్యార్థులకు అర్థమయ్యేలా సులభ పద్ధతుల్లో బోధించాలని సూచించారు. అవగాహనాయుత విద్యకు ప్రాధాన్యమివ్వాలన్నారు.

డీఈఓ ఎన్.ప్రేమకుమార్ పర్యవేక్షణలో సాగిన శిక్షణ తరగతుల్లో డిప్యూటీ ఈఓలు కె.వి.రమణ, కె.మోహనరావు, డీసీఈబీ కార్యదర్శి టి.సన్యాసిరాజు, జిల్లా కో–ఆర్డినేటర్ ఎస్.త్రినాథరావు, జె.పద్మలత, జీసీడీఓ టి.మాలతి, స్టేట్ మోనటరింగ్ ఆఫీసర్ కె.ధర్మకుమార్, ఎల్ఎఫ్ఈ రీజనల్ కో–ఆర్డినేటర్ కె.రమేష్‌బాబు, ఏఎంఓ ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

3,200 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుబడిన రేషన్ బియ్యంతో అధికారులు

బొబ్బిలి: పట్టణం నుంచి పిరిడి వెళ్లే రహదారి జంక్షన్ వద్ద 3,200 కిలోల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు సీఎస్‌డీటీ అల్లు స్వర్ణలత తెలిపారు. శనివారం సాయంత్రం తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా.. పిరిడి గ్రామానికి చెందిన రేపాక శ్రీనివాసరావుకు చెందిన బియ్యంగా గుర్తించినట్టు సీఎస్‌డీటీ చెప్పారు. దాడుల్లో విజిలెన్స్ ఎస్సై రామారావు, సిబ్బంది లక్ష్మీనారాయణ, ఈశ్వర్ పాల్గొన్నారు.

21న అండర్ -16 జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలు

విజయనగరం: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21న అండర్ -16 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఎల్ఎన్ రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని విజ్జీ స్టేడియంలో జరిగే ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు 2008 సెప్టెంబర్ 1 తర్వాత జన్మించిన వారై ఉండాలని పేర్కొన్నారు. అలాగే పోటీలకు హాజరయ్యే వారు ఒరిజినల్ ఆధార్‌కార్డు, జన్మదిన ధ్రువపత్రం, మూడేళ్ల స్టడీ సర్టిఫికెట్స్ తీసుకొని రావాలన్నారు. ఎంపికలు నిర్వహించే రోజు ఉదయం 6.30 గంటలకు వైట్ డ్రెస్, సొంత కిట్‌తో హాజరు కావాలని కోరారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరగనున్న జోనల్ స్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన సత్యం

బొండపల్లి: మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. డెంకాడకు చెందిన కనకల సత్యం (55) బొండపల్లి నుంచి విజయనగరం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో సత్యం తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు స్పందించి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. తస్యం ఆర్టీలో విధులు నిర్వహిస్తున్నాడని ఎస్సై లక్ష్మణరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చెత్తబుట్టలో పసికందు మృతదేహం



నెలలు నిండని పసికందు మృతదేహం

విజయనగరం క్రైమ్: నెలలు నిండని పసికందు మృతదేహం చెత్తబుట్టలో పడేసిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... సుమారు ఐదారు నెలల వయసున్న ప్రీ మెచ్యూర్డ్ బేబీ మృతదేహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు బాక్సులో పెట్టి గంట స్తంభం సమీపంలో ఉన్న కార్పొరేషన్ చెత్తబుట్టలో శనివారం రాత్రి పడేశారు. చెత్త వేసేందుకు వెళ్లిన కొందరికి రక్తపు చారలు కనపడడంతో బాక్స్ ఓపెన్ చేసి చూడడంతో మృతదేహం బయటపడింది. దీంతో వెంటనే టూటౌన్ పోలీసులకు సమాచారమిచ్చారు. కొద్ది గంటల వ్యవధిలోనే ఎవరో తెచ్చి పడేసి ఉంటారని పోలీసులు, స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. టూటౌన్ ఎస్సై దుర్గాప్రసాద్ పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించామని, సీసీ ఫుటేజ్ పరిశీలించి బాధితులపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ కోరాడ రామారావు తెలిపారు.

మృతదేహం గుర్తింపు

సీతంపేట: మండలంలోని పులిపుట్టి ఎర్రచెరువు వద్ద హత్యకు గురైన మహిళను ఒడిశా వాసిగా గుర్తించినట్లు పాలకొండ సీఐ ఎం. చంద్రమౌళి, ఎస్సై జగదీష్‌నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా వారు శనివారం విలేకరులతో మాట్లాడుతూ, డీఎస్పీ జీవీ కృష్ణారావు ఆదేశాల మేరకు పోలీసులు బృందాలుగా ఏర్పడి విచారణ చేపట్టారన్నారు. ఇందులో ఒక బృందం ఒడిశా వెళ్లి విచారణ చేయగా.. మృతురాలు గజపతినగరం జిల్లా గుమ్మ మండలం రుగడ గ్రామానికి చెందిన బుయన్ రుతగా గుర్తించారని చెప్పారు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹158	₹286	₹296

ఆయుష్షు పెరుగుతోంది..

- ఆస్పత్రుల్లో 'జగనన్న హృదయ స్పందన'
- గుండె నొప్పితో వచ్చే వారికి ప్రత్యేక చికిత్స
- గతేడాది సెప్టెంబర్ నెల నుంచి జిల్లాలో కార్యక్రమం అమలు
- సీహెచ్‌సీ, ఏరియా, జిల్లా ఆస్పత్రుల్లో సేవలు..
- రూ. 25 వేల విలువ చేసే ఇంజిక్షన్ ఉచితం
- సకాలంలో చికిత్స అందడంతో నిలుస్తున్న ప్రాణాలు



గజపతినగరం ఏరియా ఆస్పత్రిలో రోగికి ఈసీజీ తీస్తున్న వైద్యుడు

విజయనగరం ఫోర్ట్: మానవుని జీవన శైలిలో మార్పులు చోటుచేసుకోవడం వల్ల వయసుతో సంబంధం లేకుండా అనేక మంది గుండె జబ్బుల బారిన పడుతున్నారు. ఒకేచోట కూర్చొని గంటల తరబడి పనిచేయడం.. వ్యాయామం చేయక పోవడం.. జంక్‌ఫుడ్స్, ఫాస్ట్ ఫుడ్స్ వంటివి ఎక్కువగా తినడం వల్ల గుండె జబ్బులకు గురవుతున్నారు. గతంలో 50, 60 ఏళ్ల పైబడిన వారు గుండె జబ్బుల బారిన పడేవారు. కాని ఇప్పుడు 25, 30 ఏళ్లకే గుండె జబ్బుల బారిన పడుతున్నారు. గుండె నొప్పి (హార్ట్ ఎటాక్) వచ్చే సమయంలో సకాలంలో (గోల్డెన్ అవర్) చికిత్స అందించగలిగితే ప్రాణాపాయం తప్పుతుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గుండెనొప్పి, గుండె జబ్బుల బారిన పడిన వారికి సకాలంలో చికిత్స అందించి ప్రాణాలు కాపాడాలనే ఉద్దేశంతో జగనన్న హృదయ స్పందన అనే కార్యక్రమాన్ని చేపట్టింది. దీంతో ఎంతోమంది ప్రాణాలు నిలబడుతున్నాయి.

జగనన్న హృదయ స్పందన కార్యక్రమంలో అందించే సేవలు..

జగనన్న హృదయ స్పందన కార్యక్రమాన్ని జిల్లా ఆస్పత్రి, ఏరియా ఆస్పత్రి, సీహెచ్‌సీల్లో అమలు చేస్తున్నారు. ప్రతి ఆస్పత్రిలోనూ ప్రత్యేకమైన బెడ్ ఏర్పాటు చేశారు. ఛాతి నొప్పితో గాని అలసటతో గాని బాగా నీరసంతో గాని వచ్చే వారికి ఈసీజీ తీస్తారు. ఆ ఈసీజీ రిపోర్టును కార్డియాలజిస్ట్ ఉన్న ఆస్పత్రికి యాప్ ద్వారా పంపిస్తారు. వెంటనే ఆ రిపోర్టును కార్డియాలజిస్ట్ పరిశీలించి అవసరం ఉంటే రూ.25 వేల విలువ చేసే టీపీఏ ఇంజిక్షన్ ఇవ్వాలని సూచిస్తారు. వెంటనే సిబ్బంది ఇంజిక్షన్ ఇచ్చి, రోగి కోలుకున్న తర్వాత అవసరం అనుకుంటే కార్డియాలజిస్ట్ ఉన్న ఆస్పత్రికి రిఫర్ చేస్తారు. అక్కడ స్టంట్ వేయలా.. సర్జరీ చేయాలా, లేదా అన్నది నిర్ణయిస్తారు.

వైద్యులు, సిబ్బందికి శిక్షణ..

గుండె సమస్య ఉన్న వారికి ఇచ్చే టీపీఏ ఇంజిక్షన్ ఏ విధంగా వేయాలన్న దానిపై వైద్యులు, నర్సింగ్ సిబ్బందికి ప్రభుత్వ వైద్య కళాశాలలో శిక్షణ ఇచ్చారు. గతేడాది సెప్టెంబర్ నెలలో జగనన్న స్పందన హృదయ స్పందన కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ఇప్పటి వరకు 65 మందికి టీపీఏ ఇంజిక్షన్ ఇచ్చారు. సకాలంలో చికిత్స అందడం వల్ల చాలా మంది ప్రాణాలు నిలబడ్డాయి.

అందుబాటులో ఇంజిక్షన్లు..

ప్రతి ఆస్పత్రిలోనూ టీపీఏ వైల్స్ రెండు, మూడింటిని అందుబాటులో ప్రభుత్వం ఉంచింది. ఒక్కో ఇంజిక్షన్ ఖరీదు రూ. 25 వేలు కావడంతో దుర్వినియోగం కాకుండా వైద్యాధికారులు సక్రమంగా వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి ఆస్పత్రిలో సీసీ కెమేరాలు ఏర్పాటు చేయడంతో రోగులకు ఈసీజీ, టీపీఏ ఇంజిక్షన్లు ఇచ్చే విధానంపై ఉన్నతాధికారులు పరిశీలిస్తుంటారు.

కేసులు పరిష్కారమయ్యేలా చర్యలు

- సీనియర్ సివిల్ జడ్జి విజయ కల్యాణి



సమస్యలపై చర్చిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి విజయ కల్యాణి

విజయనగరం క్రైమ్: లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యే విధంగా పోలీసులు చర్యలు చేపట్టాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.విజయ కల్యాణి అధికారులకు సూచించారు. శనివారం స్థానిక న్యాయ సేవాసదన్‌లో ఉమ్మడి జిల్లాలైన విజయనగరం, పార్వతీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న సీఐలు, ఎస్సైలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. రాబోయే జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, నాయసేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీలకు జీఎంఆర్ ఐటీ విద్యార్థులు



బి.హరివిష్ణు



డి.చైతన్యకుమార్

రాజాం సిటీ: ఈ నెల 20 నుంచి 25 వరకు తమిళనాడులోని ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీలో జరగనున్న అంతర్ విశ్వవిద్యాలయాల పవర్ లిఫ్టింగ్ పోటీలకు స్థానిక జీఎంఆర్ ఐటీ విద్యార్థులు జేఎన్‌టీయూ జీవీ విజయనగరం తరఫున ఎంపికయ్యారని పీడీ బీహెచ్ అరుణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జీఎంఆర్ ఐటీలో జరిగిన ఎంపికల్లో కళాశాలకు చెందిన బి.హరివిష్ణు 75 కిలోల విభాగంలోను.. డి.చైతన్యకుమార్ 150 కిలోల విభాగంలో ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్, ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, స్టూడెంట్స్ డీన్ డాక్టర్ వి.రాంబాబు, విద్యార్థులు అభినందించారు.

కన్యకా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం టౌన్: వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి శనివారం వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అమ్మవారు బంగారు చీర, వజ్ర కిరీటంతో భక్తులకు దర్శనమిచ్చారు. సుప్రభాత సేవ, మహాగణపతి పూజ, గణపతి హోమం, పుణ్యాహవచనం, సూర్య నమస్కారాలు, వాసవీ మూల మంత్ర జప సహిత హోమం, ఆయుష్య హోమం, పునర్వసు నక్షత్ర జపం, మహాన్యాసపూర్వక మహాలింగార్చన, సుందరకాండ పారాయణ, చండీహోమం, శ్రీదేవీ సప్తసతి పారాయణం, 108 కలశాలతో వాసవీమాతకు అభిషేకం చేపట్టారు. ఆర్యవైశ్య సంఘ జిల్లా అధ్యక్షుడు కుమ్మరిగుంట శ్రీనివాసరావు, వరలక్ష్మీ దంపతుల సౌజన్యంతో మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి ఊంజల్ సేవ చేశారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు కోలగట్ల వీరభద్రస్వామి ఉత్సవంలో పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే గజవాహనంపై అమ్మవారి తిరువీధి ఉత్సవాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం ..

విజయనగరం టౌన్: కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. శనివారం సాయంత్రం ఆయన అమ్మవారిని దర్శించుకుని, శోభాయాత్రను ప్రారంభించారు. స్థానిక ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు కిలో బంగారంతో తయారు చేయించిన చీరను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, ఆయన సతీమణి రమణి చేతుల మీదుగా అమ్మవారికి సమర్పించారు. ఆయన వెంట దేవస్థానం కమిటీ చైర్మన్ నారాయణం శ్రీనివాసరావు, ప్రతినిధులు కుమ్మరిగుంట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యూజేఎఫ్ హ్యాండ్‌బుక్ ఉపయుక్తం..



యూజేఎఫ్ హ్యాండ్‌బుక్‌ను ఆవిష్కరిస్తున్న సమాచార, పౌర సంబంధాల విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్

- పౌరసంబంధాల శాఖ ఎ.డి రమేష్

విజయనగరం అర్బన్: ఆరు జిల్లాల సమగ్ర సమాచారంతో రూపొందించిన పుస్తకాన్ని ఉత్తరాంధ్ర జర్నలిస్ట్స్ ఫ్రంట్ (యూజేఎఫ్) రూపొందించిందని, ఈ పుస్తకం జర్నలిస్టులకే కాకుండా ప్రతి ఒక్కరికీ ఉపయుక్తంగా ఉంటుందని సమాచార, పౌర సంబంధాల విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ డి.రమేష్ అన్నారు. యూజేఎఫ్ 2024 – 25 వార్షిక హ్యాండ్‌బుక్‌ను శనివారం ఆయన కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యూజేఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ ఎంఆర్ఎస్ వర్మ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం తీసుకువస్తున్న ఈ హ్యాండ్‌బుక్ ప్రతి ఒక్కరికీ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీఆర్ఓ జానకమ్మ, యూజేఎఫ్ ప్రతినిధులు కె.శ్రీనివాస్, డి.హరనాథ్, ఎం.గణపతి, డి.శివకుమార్‌రెడ్డి, ఎస్.నారాయణరావు, భరత్‌కుమార్, బి.ఫల్గుణరావు, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

24వ తేదీ నుంచి పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు



అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్‌ఓ కేశవనాయుడు

- డీఆర్‌ఓ కేశవనాయుడు

పార్వతీపురం: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24వ తేదీ నుంచి జూన్ 3 వరకు నిర్వహిస్తామని జిల్లా రెవెన్యూ అధికారి జి. కేశవనాయుడు అన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో పదో తరగతి పరీక్షల నిర్వహణపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సప్లిమెంటరీ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. పార్వతీపురం డీవీఎంఎం ఉన్నత పాఠశాల, సాలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పాలకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒక ఫ్లయింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్షలకు 659 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, పరీక్ష కేంద్రాల్లో కనీస సౌకర్యాలైన తాగునీరు, వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునే విధంగా బస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరుగుతాయని, తదనుగుణంగా బస్సులు నడపాలన్నారు. విద్యుత్ అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. పరీక్ష పేపర్లు నిర్దేశిత కేంద్రాలకు పంపించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని పోస్టల్ సిబ్బందని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖకు సూచించారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలకు 384 మంది..

ఓపెన్ స్కూల్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 384 మంది హాజరు కానున్నారని జిల్లా రెవెన్యూ అధికారి కేశవనాయుడు తెలిపారు. పార్వతీపురం కేవీఎం పాఠశాలలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అలాగే ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షలు పార్వతీపురం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతాయని.. ఈ పరీక్షలకు 288 మంది హాజరు కానున్నారని చెప్పారు. ఓపెన్ స్కూల్ పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయన్నారు. సమావేశంలో పరీక్షల సహాయ కమిషనర్ సుధాకర్, వైద్యారోగ్యశాఖ అధికారి ఎం. వినోద్, ఆర్టీసీ సహాయ మేనేజర్ బి. కృష్ణమూర్తి, సబ్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌కుమార్, పోస్టల్ ఇన్‌స్పెక్టర్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం టౌన్: రాష్ట్ర సేవాధికార సంస్థకు మధ్యవర్తిత్వం (మీడియేటర్లు) వహించుటకు ఆసక్తిగల వ్యక్తుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విజయనగరం జిల్లా సేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి కె. విజయకల్యాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన వ్యక్తులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అర్హులైన వ్యక్తులను ఎం ప్యానల్మెంట్ జాబితాలో చేర్చడం జరుగుతుందని, మే 25వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని కోరారు. విశ్రాంత న్యాయాధికారులు, బ్యూరోక్రాట్లు, న్యాయవాదులు, ఆచార్యులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాల సభ్యులు, వివిధ రంగాలలో నిష్ణాతులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

రేపటి నుంచి కౌన్సెలింగ్

సీతానగరం: ఏపీ గిరిజన సంక్షేమ ప్రతిభా గురుకుల పాఠశాల, కళాశాలల్లో ప్రవేశాలకు సోమవారం నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జోగింపేట గిరిజన ప్రతిభా విద్యాలయం ప్రిన్సిపాల్ పోల వెంకటినాయుడు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పార్వతీపురం మన్యం జిల్లాలోని గిరిజన గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాలకు జోగింపేటలో పాఠశాలలో కౌనెల్సింగ్ నిర్వహిస్తామన్నారు. ఏప్రిల్ 7న నిర్వహించిన ప్రవేశ పరీక్షలో అర్హులైన అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరుకావాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే అభ్యర్థులకు ఫోన్ ద్వారా, కాల్‌లెటర్ల ద్వారా సమాచారం అందించామని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు జోగింపేట స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో 8వ తరగతి, ఇంటర్మీడియట్‌లో.. మల్లి (పీజీటీ) కాలేజ్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు కలిపిస్తామన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణ ఉమ్మడి జిల్లాలకు చెందిన గిరిజన బాలురు కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని కోరారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలన్నారు. వివరాలకు 94909 57218, 94401 03332 నంబర్లను సంప్రదించాలని కోరారు.

చెరువులో పడి బాలుడి మృతి

దత్తిరాజేరు: చెరువులో పడి చిన్నారి మృతి చెందిన సంఘటన మండలంలోని ఆర్. రామచంద్రాపురంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్. బూర్జవలస ఎస్సై లక్ష్మీ ప్రసన్నకుమార్ తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మండాది గౌతం (10) తోటి స్నేహితులతో కలిసి మల విసర్జనకు పప్పల చెరువుకు వెళ్లాడు. ఈ క్రమంలో కాలు జారి చెరువులో పడిపోవడంతో తోటి స్నేహితులు బయటకు తీసి విషయాన్ని గ్రామస్తులకు తెలియజేశారు. వెంటనే స్థానికులు చేరుకుని 108 సిబ్బందికి ఫోన్ చేయగా... వారు వచ్చి పరిశీలించారు. అయితే అప్పటికే చిన్నారి మృతి చెందాడు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించారు. తల్లి మృతి చెందడంతో గౌతం తాత ఇంటి వద్దనే ఉంటూ చదువుకుంటున్నాడు. మృతుడి తాత సాంబ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రి బొత్స పరామర్శ



ఆదినారాయణను పరామర్శిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

విజయనగరం: గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ నడిపిల్లి ఆదినారాయణను రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ శనివారం పరామర్శించారు. ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నాడు తీవ్ర అస్వస్థతకు గురైన ఆదినారాయణకు కుటుంబ సభ్యులు నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ శనివారం సాయంత్రం ఆస్పత్రికి వెళ్లి ఆదినారాయణను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత



అధికారులకు ఆదేశాలు జారీచేస్తున్న ఎస్పీ దీపిక

- ఎస్పీ దీపిక

విజయనగరం క్రైమ్: సార్వత్రిక ఎన్నికల తర్వాత ఈవీఎంలను భద్రపరిచిన లెండి, జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలల వద్ద భద్రతా ఏర్పాట్లను ఎస్పీ ఎం.దీపిక శనివారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈవీఎంలను భద్రపరిచిన ఇంజినీరింగ్ కళాశాలల వద్ద కేంద్ర బలగాలు, ఆర్మ్‌డ్ రిజర్వు, సివిల్ పోలీసులతో మూడంచెల భద్రత ఏర్పాటు చేశామన్నారు. అంతే కాకుండా కళాశాలలకు వెళ్లే మార్గాల్లో వాహన తనిఖీలు చేపట్టి, వాహనాలలో వెళ్లే వ్యక్తుల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నామని చెప్పారు. ఈవీఎంల భద్రతను అదనపు ఎస్పీ, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు నిరంతరం పర్యవేక్షిస్తుంటారన్నారు.